

# క రాజు కథలు

## - సింగీతం శ్రీనివాసరావు



### నా మాట

అప్పుడెప్పుడో - కాలేజీల కాలం. ఖాసా సుబ్బారావుగారు, గోరా శాస్త్రిగార్ల ప్రోత్సాహంతో భారతి, స్వతంత్రలాంటి పత్రికల్లో కొంతకాలం నా రచనా కేళి సాగింది. ఆనాడు రాసిన "అంత్యఘట్టం" నాటికను ఇప్పుడు కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయంలాంటి చోట్ల ప్రదర్శిస్తున్నారంటే అదో తృప్తి. ఆ రోజుల్లోనే టంగుటూరి సూర్యకుమారిగారు నటించి, ప్రదర్శించిన 'చిత్రార్జున' నాటకం పాటలతో సహా రాశాను. ఈ ప్రదర్శనను పండిత జవహర్ లాల్ నెహ్రూగారు ఢిల్లీలో చూశారు. ఆ తర్వాత టామ్ బకన్ అనే స్కాట్లండ్ రచయిత దీనిని ఇంగ్లీషులో తర్జుమా చేస్తే, దీన్ని అమెరికాలో తెలుగు పాటలతో ప్రదర్శించారు. ఈ తర్వాత నేను పెద్దగా రాసిందేది లేదు. "మీ సినిమాలకి మీరే మాటలు రాస్తే బాగుంటుంది" అని జంధ్యాలగారు చాలాసార్లు చెప్పారు. ఆయన మాటల్ని కాదనలేక పుష్పక విమానం తీశాను. "మీరు పాటలు రాయండి" అంటూ వేటూరిగారు ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వుండేవారు. 'భైరవద్వీపం'లో ఒకపాట ఆయన రాయాల్సుంది. ఎన్నాళ్ళకూ ఆయన దర్శనం లభించకపోయేసరికి గత్యంతరం లేక నేనే "విరిసినది వసంతగానం" పాట రాశాను. ఆ పాట బాగా రాశానని వేటూరిగారు మెచ్చుకోవడం నాకొచ్చిన పెద్ద అవార్డు.

మళ్ళీ ఇన్నాళ్ళకు కాలేజి రోజుల ఉత్సాహం మళ్ళీ పుట్టుకొచ్చింది. ఆ రోజుల్లో పింగళి నాగేంద్రరావుగారు నా చేత స్క్రిప్టు ఒక రఫ్ వర్షన్ సీన్లు రాయించేవారు. వాటిల్లోంచి ఎన్నో ఐడియాలూ, శ్రీకృష్ణార్జునయుద్ధంలో అర్జునుడి పేరు 'అజిభీధఫపావిశ్వేసకి' లాంటివి ఎన్నో వచ్చేవి. ఇంట్లో వాటిని ఫెయిర్ కాపీ చేసే పని నా అర్ధాంగి కల్యాణిది. మళ్ళీ ఆ రోజులు గుర్తొచ్చేలా ఈ కథల్ని కల్యాణే ఫెయిర్ కాపీ చేసింది. ఈ కథల్ని ఆనందిస్తూ - "ఎంజాయ్" చేస్తూ అంటే కరెక్ట్‌గా చెప్పామనిపిస్తుంది - రాశాను. చదివిన వాళ్ళూ ఎంతో కొంత ఎంజాయ్ చేస్తే మరింత ఆనందిస్తాను.

*సింగీతం శ్రీనివాసరావు*

మిత్రులు సింగీతం శ్రీనివాసరావుగారికి నాకూ కనీసం 50 ఏళ్ళ పరిచయం. ఆయన భారతికి 'అంత్యఘట్టం' రాసే రోజుల్లో నేనూ భారతికి రాస్తున్నాను. దరిమిలాను ఆయన సినిమా రంగంలో స్థిరపడిన తర్వాత యిద్దరం కలిసి చాలా సినిమాల్లో పనిచేశాం. ఆయన దర్శకత్వం, వహించిన సినిమాలకు నేను రచన చేశాను. ఆయన దర్శకత్వంలో నేను నటుడిగా పనిచేశాను. ఈ రెండూ చెయ్యకపోయినా ఆయన తీసే అన్ని సినిమాల కథలూ ముందుగా నాకు చెప్పి నాతో చర్చించడం ఒక ఆనవాయితీ. నాకు వారి నాన్నగారు రామచంద్రరావుగారు తెలుసు. ఈ విషయాన్ని ఇంత విపులంగా, ముందు చెప్పడానికి కారణం - ఆయన సెన్సాఫ్ హ్యూమర్‌తో నాకు అయిదు దశాబ్దాల బంధుత్వం ఉన్నదని చెప్పడానికి.

'ఆదిత్య 369'లో నేను, టినూ ఆనంద్, అమ్రేష్‌పురీ నటిస్తున్నాం. మరొకరెవరో గుర్తులేదు. వాళ్ళ చెవులకి వైర్లు బిగించి - భయంకరంగా వయొలిన్లు వాయించే ఏర్పాట్లు చేశారు. ఆ శబ్దాలకి వారి చెవుల్లోంచి రక్తం కారుతుంది. నా చేత ఒక డైలాగ్ చెప్పించారు శ్రీనివాసరావుగారు. నా బాస్ అమ్రేష్‌పురీతో అంటాను. "బాస్, మీరు చాలా గొప్పవారు. వయోలిన్స్ ద్వారా అద్భుతమైన 'వయొలెన్స్'ని సృష్టించగలుగుతున్నారు" అని. ఇది ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా గిలిగింతలు పెట్టినట్టు నవ్వుకుంటాను.

శ్రీనివాసరావుగారు రాసిన కథల్ని చదవడం ఇదే మొదటిసారి. చదివాక - మొదట నిర్ఘాంతపోయాను. కారణం మెల్లగా చెబుతాను. అవి చిన్నపిల్లల కథల్లాగ అతి సరళంగా, అమాయకంగా చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న పసివాడిలాగా నడిపించుకుపోయాయి. మంచి కథకి అది మొదటి, గొప్ప లక్షణం.

కాగా, మంచి భాష నేర్పేవాడు భాష శాస్త్రికావడం, బాగా పాడేవాడు తాలం బ్రహ్మయ్య, శివ భక్తుడు కాశీ విశ్వేశ్వరయ్య కావడం, దుర్మార్గులు కోరమీసాల కోటయ్య, మిడిగుడ్ల సిద్ధయ్య కావడం - యివన్నీ చిన్నపిల్లల కథలకి ఏమి తికమకలు లేని Stylisation. ఇక్కడితో ఈ కథలకి సంబంధించిన చిన్నపిల్లల ముద్ర ఆగిపోతుంది. చదివించే గొప్ప గుణాన్ని వాక్యాల, పేర్ల సన్నివేశాలతో సాధించారని చెప్పడమే నా ఉద్దేశం. అయితే వీటికి కేవలం చదివించే గుణం మాత్రమే ఉన్నదని సరిపెట్టుకోవడానికి వీలులేదు. లోకధర్మాన్నీ, లోకం తీరునీ, సమాజ స్వరూపాన్నీ అతి సునిశితంగా, కాని సున్నితంగా వెక్కిరించే - అది కేవలం వెక్కిరింత మాత్రమే కాదని అనిపించే సెన్సాఫ్ హ్యూమర్‌ని జతచేశారు. అదీ ఈ కథల్లో రచయిత సాధించినది.

సరళంగా చదివించి, సరసంగా నవ్వించి, 'అమ్మో!' అని తుళ్ళిపడేటట్టు చేసి సమాజంలోని వైపరీత్యానికి కనుబొమ్మలు ముడివేయడమో, కత్తులు నూరడమోకాక, నవ్వుతూ గాటుపెట్టే అందమయిన ఆయుధాన్ని సానబెట్టారు రచయిత ఈ కథల్లో. ఈ ధోరణిలో మార్క్‌ట్వెయిన్, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితల్ని స్ఫురణకు తెస్తారు రచయిత. అసలు ఏ రచయితయినా సమాజంలో అవకతవకల్ని చూసి కళ్ళెర్రజేయడం అతని పరిధిని దాటడం అనిపిస్తుంది నాకు. కానీ వ్యగ్రతల్ని చూపి నవ్విస్తూ వాటిని పాఠకుడి స్పృహలోకి తీసుకురావడం రచయిత పరిమితిగా నేను నమ్ముతాను. No Social Problem can be solved by any writer on paper. He can only create the consciousness. హాస్యం ఆ అపశృతిని ఫోకస్‌లోకి తెస్తుంది. ఆలోచించేట్టు చేస్తుంది. అంతవరకే రచయిత పని. తరువాత ఏ పనిని చేపట్టినా అది తనదికాని పనిని నెత్తిన వేసుకోవడమే అవుతుంది.

కొట్టండి చంపండి అనేవాడికంటే, అవినీతిని నవ్వుతూ అలంకరించి, కితకితలు పెట్టే రచయిత మంచి హెచ్చరికని చేయగలుగుతాడని నేను నమ్ముతాను. ఆ పనిని చాలా బాధ్యతగా, గంభీరంగా, ప్రొఫెషనల్‌గా, తనకి వారసత్వంగా వచ్చిన సెన్సాఫ్ హ్యూమర్‌తో ప్రతీ కథలోనూ చేసి చూపించారు.

హాస్యానికి అద్భుతమైన పదును ధ్వని. కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండకచో వెగటుగానూ ఉండవచ్చు. కానీ సమాజశీలాన్ని చిన్న గాటుతో ఉలిక్కిపడేటట్టు చేయడం ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం. వెకిలి 'ధ్వనుల'ను రాబట్టే చాలామంది రచయితలు మనకున్నారు. అర్థంలేని 'పన్'లను వాడి కంపు కొట్టించే ఘనులున్నారు. నాకు వీరందరి మధ్యా సింగీతం ప్రత్యేకంగా, విభిన్నంగా దర్శనమిస్తారు. ఈ మాట చెప్తున్నప్పుడు నా మనస్సులో మార్క్‌ట్వెయిన్ ఉన్నారు.

ఆయన ఎప్పుడో ఇండియా వచ్చారట. దక్షిణాదిన చాకలి బండమీద బట్టలు ఉతకడం చూశారట. "ఆహా! ఒక్క భారతదేశంలోనే బట్టల్తో బండల్ని బద్దలు కొట్టే విచిత్రాన్ని చూశాను" అన్నారట.

హాస్యానికి వింతకోణం, సంధించగలిగితే వింత పదునూ, సమర్థుడి చేతుల్లో వింత అస్త్రమూ కాగలదు. ఈ పనులన్నీ చేయగల నిష్ణాతుడు సింగీతం శ్రీనివాసరావు. చేసి చూపిన వేదిక - "క రాజు కథలు."

*గొల్లపూడి మారుతీరావు.*

# ఉత్తరజిత్తు - దక్షిణజిత్తు

**మంత్రి ఇలాంటి** సంకటాన్ని ఎన్నడూ అనుభవించలేదు. క రాజు రాజ్యంలోని ఎన్నో సమస్యలను తన పాలనా దక్షతతో పరిష్కరించాడు. కానీ ఇప్పుడతను ఎదుర్కొంటున్న సమస్య చిత్రమయినది. దాని కథావివరాలు ఇలా వున్నాయి.

కొంతకాలం క్రింద క రాజు మంత్రిని పిలిపించి "మంత్రీ! మీ అంచనా ప్రకారం మన ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారు?" అని కొత్త సందేహాన్ని వెలిబుచ్చాడు.

"చాలా సంతోషంగా ఉన్నారు మహారాజా! అక్కడక్కడ కొందరు తాత్కాలికంగా దుఃఖాన్ని ఎదుర్కోవచ్చు - గాయమో, రోగమో, మరణమో - ఈ దైవిక కారణాల వల్ల ఆయా కుటుంబీకులు దుఃఖం అనుభవించక తప్పదు. కానీ రోజూ ప్రజాబాహుళ్యమంతా సుఖంగానే ఉన్నారు" అన్నాడు మంత్రి.

"నేనూ అలాగే నమ్ముతున్నాను. కానీ ఎక్కడో ఒక చాకలివాడు ఇలా అనుకుంటున్నాడని ఎవరో చెప్పేవరకూ ఊళ్ళో ఏమనుకుంటున్నారో రాముల వారికే తెలియలేదు. అందుకని మీరు వెంటనే మన రహస్య క్రియానిపుణులను పంపి ఇప్పుడు మన ప్రజల సంతోష స్థాయి ఎంతుందో ఒక అంచనా వేయించండి" అన్నాడు క రాజు.

నిపుణులు కొంతమంది పరిశోధనలు చేసి మంత్రికి రహస్య నివేదికను సమర్పించారు. అది చూసి మంత్రి తెల్లబోయాడు. నివేదికలో తాననుకున్న దానికి తారుమారుగా ఉంది. ఒక కుటుంబంలో ఒకరు మరణిస్తే, చూడ్డానికి అందరూ రోదిస్తున్నా, రహస్య పరిశోధన ప్రకారం వారంతా లోలోపల సంతోషిస్తున్నారు. గాయపడినవాడు నొప్పి బాధను ప్రకటిస్తూనే, పనిపాట్ల నుంచి తప్పించుకున్నందుకు సంతోషిస్తున్నాడు. నడుము విరిగి మంచానబడ్డ ఒక స్త్రీ తనకు చాకిరీ నరకం తప్పిందనీ, కొన్నాళ్ళు మొగుడే తనకు వండిపెడ్తాడని లొట్టలేస్కుంటూంది. ఇక సంతోషంగా ఉన్నారనుకున్న ప్రజా బాహుళ్యం చూస్తే, నివేదిక ప్రకారం అందరూ దుఃఖంలోనే ఉన్నారు. ఇచ్చే డబ్బు గోరంత - చేసే చాకిరీ కొండంత అని గోలపెట్టే ఉద్యోగస్థులు, "లాభాలు తక్కువయ్యాయి, అంటే నష్టమే కదా?" అని ఏడ్చే వ్యాపారస్థులూ, కూతురికి పెళ్ళయిందనే సంతోషంకన్నా, ఉన్నదంతా ఊడ్చుకుపోయిందని తలపట్టుకున్న తండ్రి, ఎవర్నో పెళ్ళాడాలనుకుంటే ఎవరితోనో పెళ్ళయిందని లోలోపల దుఃఖించే పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ - ఇలా ఇంచుమించు అందరూ దుఃఖించేవాళ్ళేగాని సంతోషంగా ఉండేవాళ్ళెవరూ లేరు.

ఇప్పుడు ఈ నివేదికను క రాజుగారికి సమర్పించాలా వద్దా అన్నది మంత్రి సందిగ్ధం. రాజుగారు దాన్ని చూస్తే ఏమంటారు? "మంత్రీ! ఈ నివేదికను నాకు చూపడం ఎందుకు? మీరే బాధ్యత వహించి, మనమేం చేస్తే ప్రజలంతా సంతోషంగా ఉంటారో కనిపెట్టి, ఈ సమస్యను పరిష్కరించండి" అంటాడు. అంతకన్నా, తనే ఒక మార్గాన్ని ఆలోచించి సాధిస్తే రాజుగారి మెప్పున సంపాదించవచ్చని నిర్ణయించుకున్నాడు మంత్రి.

కానీ ఎంత తల బాదుకున్నా దీనికి పరిష్కార మార్గం మంత్రికి తట్టలేదు. ఈ సమయంలో ఒక సలహాదారుడు ఒక ఆసక్తికరమైన వార్తనందచేశాడు.

పడమటి కొండలకావల అంబరపురం నగరంలో ఒక వ్యక్తి ఉన్నాడట. అతని పేరు ఉత్తర జిత్తు. అతనిదొక విచిత్రమైన వ్యాపారం. అందరికీ సంతోషాన్ని అమ్ముతాడట. వందలాదిమందికి సంతోషాన్ని అమ్మి అతను కోటీశ్వరుడయ్యాడట.

ఈ వార్త విని మంత్రి పరమానంద భరితుడయ్యాడు. ఉత్తరజిత్తును తన అనతికాలంలోనే తన ధ్యేయం నెరవేర్తుంది. అనుకున్నదే తడవుగా వార్తాహరులను పంపి, మంత్రిగారి ఆజ్ఞగా ఉత్తరజిత్తును తక్షణం బయలుదేరి రావలసిందని ఆదేశించాడు.

కానీ అక్కడ తెలిసొచ్చిన నిజం. ఉత్తరజిత్తు మంత్రి ఆజ్ఞాపించగానే వచ్చేసే అందరిలాంటి సామాన్యుడు కాదని. ఈ సంవత్సరం తనకు ఖాళీలేదన్నాడు. మేఘాల్లో విహరిస్తున్నవాణ్ణి తంతే కింద పడ్డట్టయ్యింది మంత్రిపని. తన అవసరం గనక తనే ఉత్తరజిత్తు దగ్గరకు వెళ్ళాడు.

రాజభవనాన్ని మించిన ఉత్తరజిత్తు నివాసం, అతని సిబ్బంది, వాళ్ళ హంగామా చూసి మంత్రి నివ్వెరబోయాడు. ఎన్నో ద్వారాలు దాటి చివరకు అతన్ని కలిశాడు మంత్రి. ప్రాధేయపడగా పడగా కడకు రావడానికి సమ్మతించాడు. తాను పల్లకీ ఎక్కివస్తే అనుచరులు అయిదు బండ్లు, యాభై గుర్రాల మీద వస్తారట. వాళ్ళకు కావలసిన భోజన, నివాస వసతులన్నీ మంత్రిగారే ఏర్పాటు చెయ్యాలట.

ముఖాన చిరునవ్వు తెచ్చుకుని అన్నిటికీ సరేనన్నాడు మంత్రి.

ఇక్కడి జనంలో సంతోషాన్ని కొనడం ఏమిటో చూడాలనే ఆసక్తి మొలకెత్తింది.

ఎట్టకేలకు ఉత్తరజిత్తుని సంతోష విక్రయప్రక్రియ ప్రారంభం అయ్యింది.

కళ్యాణ మంటపాన్ని బోలిన విశాలమైన ఒక మందిరం. దానికి పలుద్వారాలు. ప్రజలు ఈ ద్వారాలు దగ్గరున్న సిబ్బందికి పైకము చెల్లించి, మందిరంలో ప్రవేశించి ఆసీనులయ్యారు. కాస్సేపటికి ఉత్తరజిత్తు ప్రవేశించాడు. జరీ అంచు వేసిన రంగురంగుల పట్టు వస్త్రాలతో అతను మెరిసిపోతున్నాడు. అతనివెంట ఇద్దరు అనుచరులు. వాళ్ళ చేతిలో విభూతితో నిండిన రెండు పెద్ద పాత్రలు. ఉత్తరజిత్తు తన ఉపోద్ఘాతాన్ని మొదలెట్టాడు.

"సంతోష మారుతాన్ని ఆస్వాదించ వచ్చిన సోదరులారా! సోదరీమణులారా! (అంతా చప్పట్లు) దుఃఖం అంటే ఏమిటి? ఉండాలనుకున్నది లేనప్పుడు కలిగే చేదు 'అనుభవం' సంతోషం అంటే ఏమిటి? కావాలనుకుంది ఉంటే కలిగే తీపి 'అనుభవం' మనకు ఉండటం ముఖ్యంకాదు. ఉన్నప్పుడు కలిగే అనుభవం ముఖ్యం. అమూల్యమైన ఈ అనుభవాన్ని చౌకగా ఇప్పుడు మీకు అందచేస్తున్నాను" అంటూ చేతిలోని విభూతి తీసుకుని అందరిమీదా చల్లాడు. ఆ క్షణం మందిరం అంతా చీకటైపోయింది. అందరూ చూస్తున్నవైపు ఒక వెలుగొచ్చి అందులో కొన్ని అద్భుత దృశ్యాలు కనిపించాయి. ఈ పరిసరాల్లో ఎవ్వరూ చూడని సుందరప్రదేశాలు, భవనాలు, ఉద్యానవనాలు - అందులో విలాసంగా విహరిస్తూ హాయిగా జీవితాలను గడిపే అందమయిన స్త్రీ పురుషులు. క్రమేణా చూసేవారంతా ఆ దృశ్యంలో ఒకరై ఆనందానుభూతిని పొందుతున్నారు. ఈ సంతోషం అంతా ఇంతాకాదు. మందిరం నుంచి బయటికి వచ్చిన చాలాసేపటివరకూ ఇది గుడ్డం అంటించిన అత్తరులా ఘుమఘుమలాడ్తూనే ఉంది.

ప్రక్రియ విజయవంతమైంది. సంతోషాన్ని కొనే వారి సంఖ్య వందలనుంచి వేలకు పెరిగింది. చూసినవాళ్ళే మళ్ళీమళ్ళీ వెళ్ళి విభూతి చల్లించుకుని ఆనందిస్తున్నారు. లేనివారు ఉన్నవారిలా ఆనందాన్ని పొందుతుంటే, మరికొందరు ఆడామగా కూడా, రకరకాల శృంగారపు ఆనందాల్ని పొందుతూ, తమను ఎవ్వరూ తప్పుపట్టలేని ఈ కొత్త పద్ధతిని మనసారా మెచ్చుకుంటున్నారు. అనతికాలంలోనే నగరమంతా ప్రజల సంతోషంతో నిండిపోయింది. మంత్రి హాయిగా ఒక నిట్టూర్పు విడిచాడు. ఆ క్షణమే అతనికి ఒక నిజాయితీ పరుడైన ప్రభుత్వోద్యోగి ద్వారా ఒక భయంకరమైన నిజం తెలిసివచ్చింది.

చిన్న మొత్తానికి పెద్ద సంతోషం కొనడానికి అలవాటుపడ్డ జనం వాళ్ళ దినదిన వృత్తుల మీద చిన్నచూపు చూశారు. పనిచేసే వారంతా సగం పని కాకముందే దాన్ని ఆపేసి సంతోషం కొనడానికి పరుగెత్తారు. విద్యార్థులకిప్పుడు విభూతి చల్లించుకుని నేర్చుకున్నదే ముఖ్యమయిన విద్య అయింది. దీని ప్రభావం - ఇప్పుడు పని చేసేవాళ్ళెవరూ లేరు. అంతా ఉన్నది తినేవాళ్ళే. ఇలా తింటూంటే ఉగాది వచ్చేసరికి తినడానికేం ఉండదు.. ఇది ప్రజలకు ఎంత నచ్చ చెప్ప ప్రయత్నించినా, వినిపించుకునే స్థితిలో ఎవ్వరూ లేరు. ఇదన్నమాట మొదట్లో చెప్పిన మంత్రిగారికిప్పుడు వచ్చిన పెద్ద సంకటం. ఈ పరిస్థితిలో రాజుగారికి విషయం చెప్పకపోతే ప్రమాదం అనుకున్నాడు మంత్రి.

క రాజు కథంతా విన్నాడు.

"మంత్రీ! దీనికొక మార్గం ఉంది. నే చెప్పినట్టు చెయ్యండి" అన్నాడు క రాజు. మంత్రికి నెత్తినున్న కొండను ఎవరో దించినట్టయింది.

"మీరు వెంటనే వెళ్ళి, దక్షిణ జిత్తును కలిసి అతన్ని మన నగరానికి ఆహ్వానించండి" అన్నాడు క రాజు.

"దక్షిణజిత్తా? అదెవరు?" అన్నాడు మంత్రి కంగారుగా.

"ఉత్తరజిత్తులాంటి మరొక సంతోష వ్యాపారి"

"ఒక్కరితోనే సతమతమౌతుంటే ఇద్దరా మహారాజా?"

"సందేహించకండి మంత్రీ! నేను చెప్పినట్టు చేయండి."

మంత్రి దక్షిణ జిత్తును కలిశాడు. హంసానదికి దక్షిణాన ఉన్న అతనికి ఉత్తర జిత్తుకున్న హంగులన్నీ ఉన్నాయి. కాకపోతే ఇలాంటి వాటికి మంత్రి ఇప్పుడు అలవాటు పడున్నాడు గనక పెద్దగా ఆశ్చర్యపోలేదు.

దక్షిణజిత్తు ఆగమనంతో ఇంతవరకు ఏకైక సార్వభౌముడిగా వెలుగుతున్న ఉత్తరజిత్తులో ఒక చిన్న చలి పుట్టుకొచ్చింది. ప్రజలు మాత్రం ఈ కొత్త సంతోషాన్ని అనుభవించేందుకు ఉరకలు వేశారు. కారణం, దక్షిణజిత్తు కొత్త ఆకర్షణగా అందించిన సంతోషసారం - భీభత్సం! చంపుకోడం, నరుక్కోడంలాంటి సంఘటనలలో పూర్తిగా లీనమై, మునుపెన్నడూ అనుభవించని ఆనందమకరందాన్ని ఇప్పుడు ఆసక్తితో గ్రోలారు ప్రజలు.

ఉత్తరజిత్తు వ్యాపారానికి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పుడు ఇద్దరి మధ్యా పోటీ పెరిగింది. మా దగ్గర కొన్నవారు "అహోహో" అంటున్నారంటే, మా దగ్గర కొన్నవారు "ఒహోహోహో" అంటున్నారనీ, కాదు "ఇహిహిహి" అని ఇకిలిస్తున్నారని, ఇలా మాటల యుద్ధం పెరిగి, వ్యూహాల ఆలోచనలోకి దారితీసింది.

ఉత్తరజిత్తు ఒక పన్నాగం పన్నాడు. అర్ధరాత్రిలో దక్షిణజిత్తు నివాసంలోకి రహస్యంగా దూరి, ఎవ్వరికీ తెలియకుండా అక్కడున్న మంత్ర విభూతిని దొంగిలించి, దాని స్థానంలో మంత్ర హీనమయిన విభూతిని పెట్టమని తన అనుచరులకు ఆజ్ఞాపించాడు. ఇదే సమయంలో ఇదే ఆలోచన దక్షిణ జిత్తుకు కూడా వచ్చింది. ఇలా ఒకరికి తెలియకుండా ఒకరు ఎదుటివాడి మంత్ర విభూతిని దొంగిలించి, మంత్రహీనమయిన విభూతిని పెట్టేశారు. ఉదయం అయ్యేసరికి ఎవరికి వారు ఎదుటివాడు నవ్వులపాలు కాబోతున్నాడనుకుంటూ మురిసిపోతున్నారు.

ఆ రోజు సంక్రాంతి. తాము కొనబోయే సంతోషం అపూర్వమై ఉంటుందనే భావనతో అందరూ ద్విగుణీకృతమయిన పైకం చెల్లించారు.

అక్కడ ఉత్తరజిత్తు, ఇక్కడ దక్షిణజిత్తు ఏకకాలంలో వచ్చి వారి వారి ముందున్న ప్రజమీద విభూతి చల్లారు. కానీ, ఎవ్వరూ ఊహించని ఘోరం. ఇప్పుడు కనిపించిన దృశ్యాలు పేలవంగా ఉన్నాయి. ఆకలితో మలమలమాడేవానికి పురుగులున్న ఆహారం వడ్డించినట్టు అనిపించింది. పుష్పకవిమానంలో ఎగిరేవాడు కాలుజారి కిందపడి ఎముకలు విరగ్గొట్టుకున్నట్టనిపించింది. ప్రజల్లో ఆగ్రహం ఒక్కసారిగా ఉప్పెనలా విజృంభించింది. వారిని మోసం చేసిన జిత్తులకు తగిన శిక్ష విధించాలని నినాదాలు చేస్తూ వాళ్ళ మీద విరుచుకుపడ్డారు. భయాక్రాంతులైన ఉత్తర దక్షిణ జిత్తులు దౌడుతీసారు. దొరికిన గుఱ్ఱాలనెక్కి మళ్ళీ తిరిగి చూడకుండా నగర పొలిమేరలను దాటుకున్నారు.

కథ సుఖాంతంగా ముగియడంతో మంత్రి పరమానంద భరితుడయ్యాడు ఈ సమయంలో వార్తాహరుడొకడు వచ్చి,

"మంత్రి ప్రభో! ఎవరో పశ్చిమజిత్తట.. మిమ్మల్ని కలవాలట" అన్నాడు. మంత్రిగారు రౌద్రాకారుడై "పశ్చిమజిత్తు కాదుకదా, ఏ దిక్కు జిత్తైనా సరే, ఈ రాజ్యంలో కాలుపెడితే వాడికాళ్ళు విరగ్గొట్తామని రాజ్యమంతా చాటించమని చెప్పు" అని ఘర్జించాడు తన అధికార దర్పానికి తానే మురిసిపోతూ.

*(ఈ కథలన్నీ గతంలో హాసం పత్రికలో ప్రచురించబడ్డాయి. అంతర్జాతీయంగా ఉన్న తెలుగువారందరికి చేరాలన్న ఉద్దేశంతో రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రిస్తున్నాము )*

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments